చేతివృత్తికి తోడు.. జగనన్న చేదోడు

- నియోజకవర్గంలో 1,422 మందికి లబ్ధి
- ఖాతాల్లో రూ. 14.22 కోట్లు జమ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు


ఇస్త్రీ చేస్తున్న రజక మహిళ


కటింగ్ చేస్తున్న నాయీబ్రాహ్మణుడు

నందికొట్కూరు: బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు.. సమాజానికి బ్యాక్‌బోన్ క్లాస్ అని నమ్ముతూ.. చేతి వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రజక, నాయీబ్రహ్మణ, దర్జీల జీవితాల్లో మార్పురావాలని వారి ఖాతాల్లో ఏటా రూ.10వేలు జమ చేస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఈనెల 19న కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులో జరిగిన సభలో బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేశారు.

ఈనెల 19న నగదు జమ..

నియోజకవర్గం వ్యాప్తంగా అర్హులైన రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములను, అక్కాచెల్లెమ్మలు జగనన్న చేదోడు పథకం కింద 1,422 మంది ఈ ఏడాది లబ్ధి పొందారు. ఇందులో దర్జీలు–523, రజకులు–567, నాయీబ్రాహ్మణులు–332 ఉన్నారు. వీరికి జగనన్న చేదోడు పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన బటన్ నొక్కి నేరుగా రూ.14.22 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. దీంతో రజకులు బండి కొనుగోలు చేసుకునేందుకు, నాయీబ్రాహ్మణులకు బార్బర్ షాపు నిర్వహణ, దర్జీలకు కుటుమిషన్ల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు తోడుగా ఉన్నారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగనన్న



పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం కింద నగదు రూ. 10 వేలు మా ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికార యంత్రాంగం మా వద్దకే వచ్చి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నన్ను జగనన్న చేదోడు పథకానికి ఎంపిక చేశారు. ఇటువంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఉండటం మాలాంటి వారి అదృష్టం.

– మంగలి రాముడు, జీ. వీరాపురం, కొత్తపల్లి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు చేదోడు పథకం కింద అండగా నిలిచిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. నాకు నాలుగేళ్లుగా జగనన్న చేదోడు పథకం ద్వారా నేరుగా నా బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతున్నాయి. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు నేరుగా మా దగ్గరకే వచ్చి బయోమెట్రిక్ వేలిముద్రలు వేయించుకొని జగనన్న చేదోడు పథకం మంజూరు చేశారు. మాలాంటి చేతివృత్తివారిని గుర్తించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థిక వెసులుబాటు కల్పించారు. – ఉసేన్‌బీ, టైలరు, పాములపాడు

కరోనా కాలంలో అండగా..



కరోనా కష్టకాలంలోజగనన్న చేదోడు పథకం మా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన రూ. 10 వేలు కుటుంబానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఇంత వరకు ఏ ప్రభుత్వమూ చేతివృత్తులను గుర్తించి నగదు మంజూరు చేయలేదు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఏటా మా ఖాతాలో నగదు జమ చేశారు. – చాకలి లక్ష్మీదేవి, శాతనకోట, నందికొట్కూరు

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో మండలంలోని గ్రామాల సమస్యలు, ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సూచించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మహానంది: గ్రామాల్లోని దుకాణాల్లో గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. తిమ్మాపురం మహానంది గ్రామాల్లో పలు దుకాణాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. సుమారు 10 దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

మల్లన్న సేవలో ప్రముఖులు


అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను భువనేశ్వర్ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, గుజరాత్ కంస్యూమర్స్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సెల్ కమిషన్ ప్రెసిడెంట్ ఎంజే మెహతా, ముంబాయ్‌కు చెందిన ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రకాష్ సింగ్ శ్రీ ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఆదివారం ముంబయ్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీల్ కమిషన్ జాయింట్ సీఈఓ సత్యనారాయణ శుక్లా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి


ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ సంఘాల నాయకులు

ఆత్మకూరు: విజయవాడలోని ఆటోనగర్ డిపోకు చెందిన డ్రైవర్‌పై కావలి వద్ద దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షఫివుల్లా, ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ నాయకులు సుబ్బయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏపీఎస్సార్‌టీసీ డిపో ఆవరణలో ఆదివారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ విధి నిర్వహణలో ఉండగా హార్న్ కొట్టడం తప్పేమి కాదని, ఈ సమయంలో కొందరు దాడికి పాల్పడడం సరి కాదన్నారు. ఇప్పటికీ పోలీసులు నిందితులను అరెస్ట్ చేయలేదని, వారిని సత్వరమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కుమార్, ఖలీలుల్లా, జబివుల్లా, అజాద్, నిజామొద్దీన్, రెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారంలో ఆలయ శుద్ధి పూజలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారంలో గ్రహణం అనంతరం ఆదివారం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి పూజలు నిర్వహించారు. ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీగంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన సేవలు జరిపించుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నందికొట్కూరు: ప్రభుత్వం పేదలకు సరఫరా చేసిన పీడీఎస్ బి అక్రమంగా తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్ నాగులకట్ట వద్ద ఆటోలో ప్రభుత్వ బియ్యం 50 కేజీల చొప్పున 22 ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యంతో పాటు ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి సరఫరా చేస్తున్న బియ్యం అక్రమంగా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు తరలిస్తునట్లు సమాచారం ఉందన్నారు. ఆటోల ద్వారా ఒక ప్రాంతానికి తరలించి లారీల ద్వారా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ నమో దు చేయడం ఖాయమని హెచ్చరించారు.

కొత్తపల్లిలో వర్షం

కొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న రైతులు కొంతమేర ఇబ్బంది పడాల్సి వచ్చింది. కొత్తపల్లితోపాటు లింగాపురం, ఎదురుపాడు, తదితర గ్రామాలలో కూడా వర్షం పడింది.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం


దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఏఈఓ

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ వెంకటనాగమల్లేష్ రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆదివారం విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఫణీధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ప్రభుత్వం చేసే ప్రతి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: ప్రభుత్వం చేసే ప్రతిపనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాబోవు ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై పార్టీ నాయకులతో, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపనలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించి, వచ్చేఎన్నికల్లో గెలిచి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కలసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పి.నాగలక్ష్మీరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, సర్పంచులు బాల ఎల్లయ్య, జమిలాబీ, ఎంపీటీసీలు స్రవంతి, బాలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకొని సత్ప్రవర్తనతో జీవించండి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మారుతిశంకర్

జూపాడుబంగ్లా: ప్రవర్తన మార్చుకొని పద్ధతిగా జీవించాలని రౌడీషీటర్లను ఎస్‌ఐ మారుతిశంకర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలో పలు కేసుల్లో నిందితులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గతంలో చేసిన పొరపాట్లు, తప్పిదాలను విస్మరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. అలా కాకుండా యథావిధిగా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. అలాంటివారిపై పీడీయాక్టు ప్రయోగించి గ్రామ, జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్త కలిగి వయోభారం, అనారోగ్యంతో బాధపడున్న వారి పేర్లు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, వారికి ఊరటకలిగేలా చేస్తామన్నారు. ప్రతి ఆదివారం తప్పనిసరిగా పోలీసుస్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లాలన్నారు. పోలీసువారి హెచ్చరికలు భేఖాతర్‌చేస్తే సహించేదిలేదన్నారు. అలాగే గ్రామాల్లో బెల్టుదుకాణాలు నిర్వహించి అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయించినట్లు తెలిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'


ప్రజారక్షణ భేరిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏసురత్నం

ఆత్మకూరు: రాష్ట్రానికి ద్రోహం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ఆ పార్టీకి కొమ్ము కాస్తున్న పార్టీలను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆదివారం ప్రజా రక్షణ భేరీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర ధరలు పెంచిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా ప్రజల మధ్య, కుల,మతాల మధ్య చిచ్చులు పెట్టి మతతత్వాన్ని రెచ్చగొడుతుందని ఆరోపించారు. ఈ నెల 31న పట్టణంలోని పాతబస్టాండ్‌లో జరిగే బహిరంగ సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ హాజరవుతారన్నారు. సమావేశాన్ని పట్టణప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్ నాయక్, నాగేశ్వరరావు, స్వాములు, బాలశివుడు, గణపతి తదితరులు పాల్గొన్నారు.


'విభజన హామీలను విస్మరించిన బీజేపీ'

నందికొట్కూరు: రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు రామేశ్వరరావు అన్నారు. ఆదివారం పాములపాడు మండల పరిధిలోని లింగాల, చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల మీదుగా ప్రజారక్షణ భేరి యాత్ర కొనసాగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని విడగొట్టే సమయంలో బీజేపీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల జీవితాలతో చెలగాటమాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమను, రైల్వే జోన్ వంటి విభజన హామీలు అమలు నోచుకోలేదని ధ్వజ మెత్తారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమన్న, వెంకటేశ్వరరావు, బాల ఏసు, వెంకటరమణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించండి

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానంలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్, పారిశుద్ధ్య విభాగం కార్మికుల వేతనాలను జీఓ నంబర్ 7 మేరకు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, మండల కార్యదర్శి మారెన్న దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజును కోరారు. గతంలో జీఓ నెంబర్ 11 వలన వేతనాలు తక్కువగా ఉండేవని, దానిని దృష్టిలో ఉంచుకుని వేతనాలు పెంచుతూ జీఓ నెంబర్ 07 మేరకు వేతనాలు పెంచే విధంగా కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. అయితే ఆ జీఓను ఇప్పటి వరకు అమలు చేయకుండా పాత జీఓకు అనుగుణంగానే తక్కువ వేతనాలను కార్మికులకు అందజేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం టెండర్ ద్వారా పనిచేస్తున్న ఏజెన్సీ రద్దు చేసి, తిరిగి రీ–టెండర్ పిలిచి కొత్త జీఓను అమలు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

నంద్యాలటౌన్: ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నర్మదా హాస్పిటల్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అగహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన లేక పోవడం వల్ల వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించలేక పోతున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్ స్వీయ పరీక్ష గురించి మహిళల్లో అవగహన కల్పిస్తే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. అనంతరం మహిళలకు అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, డాక్టర్లు నర్మద, సరిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో భారీ అగ్నిప్రమాదం

- మూడు పాడె గేదెలు, దూడలు, రెండు గడ్డివాములు, ఇల్లు దగ్ధం
- దాదాపు రూ.8 లక్షల ఆస్తి నష్టం
- బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే శిల్పా భరోసా




బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే,అగ్నిప్రమాదంలో కాలిపోయిన షెడ్డు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనలో విజయ్‌భాస్కర్ రెడ్డికి చెందిన మూడు పాడిగేదెలు, దూడలు, ఇళ్లు, రెండు గడ్డివాములు, ఒక షెడ్, వ్యవసాయ పనిముట్లు, వంటసామగ్రి, కుటుంబానికి చెందిన నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన కరెంట్ తీగలకు మంటలు వ్యాపించి గడ్డివాముతో పాటు షెడ్, అందులో ఉన్న పాడిపశువులు, వంటసామగ్రితో సహా కాలిపోయాయి. కుటుంబసభ్యులు ఇంటి బయట నిద్రించడంతో వారికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా బయటపడ్డారు. కేవలం దంపతులు మాత్రమే ఉండడం వలన పశువులను షెడ్లనుంచి బయటికి తీసుకురాలేకపోయారు. మంటలు భారీగా వ్యాపించడంతో గ్రామంలో ఉన్న ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు తారాస్థాయికి చేరుకున్నాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి హుటాహుటిన ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అలాగే విద్యుత్ అధికారులు సమాచారం ఇవ్వడంతో కరెంట్ నిలిపివేశారు. కుటుంబసభ్యులు సర్వం కాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

ఎమ్మెల్యే రూ.20 వేల ఆర్థిక సాయం

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం అగ్నిప్రమాద బాధితుడు విజయభాస్కర్ రెడ్డికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా ఏదైనా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పక్కాగృహం నిర్మాణానికి కూడ తన వంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లింగారెడ్డి లక్ష్మీరెడ్డి, కుందూరు నాగేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి,, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

నందికొట్కూరు: పట్టణంలోని సుబ్బారావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్ట్ శ్రీను చిన్నమ్మ పార్వతమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ దాసిసుధాకర్‌రెడ్డి అక్కడికి చేరుకొని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు చింతా విజ్జి, రవి కుమార్‌రెడ్డిలతో కలసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యకర్తకల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

9న ఉర్దూ రథన్ అవార్డుల ప్రదానం

నంద్యాల(వ్యవసాయం): నవంబర్ 9వ తేదీన ప్రముఖ ఉర్దూ కవి అల్లామా ఇక్బాల్ జయంతి సందర్భంగా స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ప్రతిష్టాత్మకమైన ఉర్దూ రథన్ అవార్డులు ప్రదానం చేస్తామని నంద్యాల కార్వాన్–ఏ ఉర్దూ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ రథన్ అవార్డుల కోసం దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉర్దూ భాషకు సేవ చేసిన ప్రముఖులకు అవార్డుతో సన్మానిస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉర్దూ సాహిత్య సేవలు చేసిన ఉర్దూ టీచర్లకు, సర్వశిక్ష అభియాన్ వలంటీర్లకు, రాష్ట్ర స్థాయి ఉర్దూ జర్నలిస్టులకు అవార్డులు ఉంటాయన్నారు. ఈ దరఖాస్తు ఫారాలు నవంబర్ 4వ తేదీ వరకు ఉర్దూ లైబ్రరీలో లభిస్తాయని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9059590071 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. హాజీ అబ్దుల్‌సుకూర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సలాముల్లా, అబ్దుల్‌అజీజ్, డాక్టర్ అంజాద్, అంజాద్‌షరీఫ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి

జూపాడుబంగ్లా: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం జూపాడుబంగ్లా లోని పాత సినిమా థియేటర్ వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా, ప్రజలకు సచివాలయాల ద్వారా ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందేలాచేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. టీడీపీ పాలనలో అమలుచేసిన పథకాలు, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరో పర్యాయం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించేలా అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 9 నుంచి ఇంటింటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే అనే విషయమై ప్రజలకు తెలియజేసి వారి మద్దతు కూడగట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ వెంకటరమణ, నాయకులు నాగేశనారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం


బంగారు చీర అలంకారంలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో అమ్మవారి వసంతోత్సవ వేడుకలు ఆదివారం వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కన్యలతో చెరువు కట్టకు మేళతాళాలతో వెళ్లి గంగాజలం తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేసి బంగారు చీరతో అలంకరించారు. అంతకు ముందు ఉదయాన్నే పసుపు నీళ్లతో రంగుబడిని ఏర్పాటు చేసి పట్టణంలో ఊరేగింపుగా వసంతోత్సవాన్ని నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం పట్టణంలోని ఆర్యవైశ్యులందరికీ ఊరివిందు ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, శేషు, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు తాండూరి ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.


ఊరివిందు ఏర్పాటు చేసిన దృశ్యం

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

నంద్యాల(వ్యవసాయం): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని జేసీఎస్ జిల్లా కన్వీనర్, ట్రిపుల్ ఆర్ సెంటర్ నిర్వాహకులు సాయిరాంరెడ్డి కోరారు. పట్టణంలోని పురాతన గ్రంథాలయానికి 127 పుస్తకాలను ఆదివారం గ్రంథాలయ నిర్వాహకుడు శివకు అందజేశారు. సాయిరాంరెడ్డి మాట్లాడుతూ పాత పేట గ్రంథాలయం ద్వారా ఎంతో మంది విజ్ఞానాన్ని పొందడమే కాకుండా ఉద్యోగాలు సాధించారన్నారు. గ్రంథాలయ సిబ్బంది కోటి, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధించుకుందాం

నంద్యాల(అర్బన్): ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని జిల్లాలోని 33 మండలాల్లో విజయవంతంగా నిర్వహించామని, అదే ఉత్సాహంతో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధించుకొనే దిశగా సాగాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం పోటీలను గురురాజ బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. రెండో రోజు ఉమ్మడి జిల్లా నుంచి 99 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్‌గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు